

# మహిళల ఆరోగ్య రక్షణే లక్ష్యం

**ప్రజానావ, గంభీరావుపేట:** మహిళల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మలేష్ యాదవ్ అన్నారు. మండలంలోని నర్మాల గ్రామంలో శ్రీరామ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ఉజ్వల పథకం కింద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లను గ్రామ సర్పంచ్ రాజబోయిన అర్చన సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కట్టెల పొయ్యి వాడకంతో మహిళలు కళ్ల సమస్యలు, శ్వాస సంబంధిత అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆడ తల్లుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉజ్వల పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందిస్తున్నారని పేర్కొన్నారు. "శివరాత్రి 2.0" కానుకగా దేశ వ్యాప్తంగా 25 లక్షల మహిళలకు ఉచిత ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు అందించేందుకు కేంద్రం శ్రీకారం చుట్టినందుకు గ్రామ మహిళల తరపున ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు అవసరమైన ధృవపత్రాలను సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రతి గ్యాస్ సిలిండర్‌పై రూ.300 సబ్సిడీతో పాటు సంవత్సరానికి 12 సిలిండర్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుదర్శన్, శ్రీరామ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం, బీజేపీ బూత్ అధ్యక్షుడు ఎల్లం, కార్యకర్తలు రాజు, దేవా గౌడ్, చాత్ర బోయినరాజు, రాజేష్ చారి, రాకేష్, రాజేష్, శ్రీనివాస్, లబ్ధిదారులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులపై ఎలుగుబంటి దాడి

## ఒకరి మృతి.. ఎనిమిది మందికి గాయాలు



**ప్రజానావ, నేరడిగొండ(బోథ్):** తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఎలుగుబంటి దాడి ఘటన కలకలం రేపింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ తాలూకా దయాల్ దన్నూర్ గ్రామానికి చెందిన రైతులపై ఎలుగుబంటి దాడి చేసింది. ఒకరు మృతి చెందగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. రెండు రోజుల క్రితం దయాల్ దన్నూర్ గ్రామానికి చెందిన రైతులు మొక్కజొన్న పంటకు నీరు అందించేందుకు అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న సర్వే నం. 89 వ్యవసాయ భూమికి వెళ్లారు. ఈ సమయంలో అక్కడికి వచ్చిన ఎలుగుబంటి గ్రామానికి చెందిన దత్త బలిరాం జాదవ్(55)పై అకస్మాత్తుగా దాడి చేసింది. ఆయనను రక్షించేందుకు వెళ్లిన మరో ఎనిమిది మంది రైతులపై కూడా దాడి చేసినట్లు బోథ్ సీఐ గురుస్వామి తెలిపారు. గాయపడిన ఎనిమిది మందిలో నలుగురు తీవ్రంగా గాయపడగా, వారిలో ముగ్గురిని నాందేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి, ఒకరిని సంబాజీ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో నలుగురికి స్వల్ప గాయాలు కాగా స్థానికంగా చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో బోథ్ మండలంలోని సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు. అటవీ ప్రాంతాలకు ఒంటరిగా వెళ్లవద్దని, ముఖ్యంగా సాయంత్రం వేళల్లో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అటవీ ప్రాంతానికి సమీప గ్రామాల ప్రజలు ఏవైనా అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# క్షయ వ్యాధిపై అవగాహన ఉండాలి

**ప్రజానావ, తాండూర్:** క్షయ వ్యాధిపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ఝాన్సీరాణి, డాక్టర్ లక్ష్మీ ప్రసన్నలు అన్నారు. మంచిర్యాల జిల్లా తాండూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. రెండు వారాలకు పైగా దగ్గు ఉంటే క్షయ వ్యాధిగా అనుమానించి వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధి నిర్ధారణకు ఉచితంగా తెమడ, ఎక్స్‌రే పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి పూర్తిగా ఉచిత చికిత్స అందించడంతో పాటు, చికిత్స పూర్తయ్యే వరకు ప్రతినెల రూ.వెయ్యి చొప్పున పోషణ భత్యం ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి క్షయ వ్యాధి త్వరగా సోకే ప్రమాదం ఉందని, పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. తుంపర్ల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే ఈ వ్యాధి మద్యం సేవించే వారు, పొగాకు నమిలే వారికి ఎక్కువగా సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సకాలంలో నిర్ధారణ చేసి చికిత్స ప్రారంభిస్తే వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. శిబిరంలో అవసరమైన వారికి వివిధ పరీక్షలు నిర్వహించారు. తెమడ పరీక్ష కోసం 24 మందికి నమూనాలు సేకరించగా, ఎక్స్‌రే అవసరమైన 85 మందికి గ్రామానికి సమీపంలోనే పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రం ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముడి మడుగుల సురేష్, ఉప సర్పంచ్ సత్యం, పంచాయతీ కార్యదర్శి దివాకర్, తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి ఈసా, మాజీ ఎంపీటీసీ సిరంగి శంకర్, ఎంఎల్‌ఎచ్‌పీలు ప్రసన్న కుమారి, డివిజన్ క్షయవ్యాధి సూపర్‌వైజర్ శ్రీపెల్లి శశికాంత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మేరీ, హెల్త్ సూపర్‌వైజర్లు రమాదేవి, తార, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు శోభరాణి, తిరుపతమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ హాకీం, ఎక్స్‌రే టెక్నీషియన్ శ్రీకాంత్, ఆశా కార్యకర్తలు భారతి, సునీత, తిరుమల, రాజేశ్వరి, రేవతి, అనురాధ, వైఆర్జీ కేర్ ఎల్‌డబ్ల్యూఎస్ సరళ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.









# భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా ధర్నా

ప్రజానావ, హైదరాబాద్: ప్రతిపాదిత భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా కార్మిక మరియు రైతు సంఘాలు ఇందిరా పార్క్‌లోని ధర్నా చౌక్ వద్ద భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించాయి. ఈ నిరసన కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ గారు హాజరై ఉద్యమకారులకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మోత రోహిత్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరిధర్ సహ పలువురు నాయకులు పాల్గొన్నారు. కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున హాజరై కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, దేశీయ పరిశ్రమలు, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలు (ఎస్ఎంఈఎస్), రైతులు, కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసే ఏ వాణిజ్య ఒప్పందాన్నీ అంగీకరించబోమన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాల్సిన సమయంలో విదేశీ కంపెనీలకు ప్రాధాన్యం ఇచ్చే నిర్ణయాలు తీసుకోవడం దీర్ఘకాలికంగా తీవ్ర ప్రభావాలు చూపుతుందని హెచ్చరించారు. పారదర్శక చర్చలు, ప్రజాభిప్రాయం తీసుకున్న తరువాత మాత్రమే ఏ వాణిజ్య ఒప్పందానికైనా తుది రూపం ఇవ్వాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేశ్, శేఖర్ యాదవ్, విష్ణు, జగదీశ్, బోదాస్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి జాతర విజయవంతం చేయాలి

## ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజానావ, సిరిసిల్ల:** మహా శివరాత్రి జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించి విజయవంతం చేయాలని ఇంచార్జి కలెక్టర్, మహా శివరాత్రి జాతర కమిటీ చైర్ పర్సన్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈనెల 14, 15, 16 తేదీల్లో మహా శివరాత్రి జాతర సందర్భంగా అన్ని శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్, మహా శివరాత్రి జాతర కమిటీ చైర్ పర్సన్ గరిమ అగ్రవాల్ గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమేశ్వర ఆలయంలో మహా శివరాత్రి జాతర సందర్భంగా భక్తులు స్వామి వారి దర్శనాన్ని సౌకర్యంగా చేసుకునేలా తుది దశ ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ, వేములవాడ మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి సంయుక్తంగా ఆలయ పరిసరాలు, పార్కింగ్ స్థలాలు, క్యూ లైన్లు ఇతర చోట్ల మూడు షిఫ్టులో సిబ్బంది ఉండేలా చూడాలన్నారు. జాతరకు ముందు నుంచి మూడు రోజుల వరకు పారిశుధ్య సేవలు అందించాలని



అన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆధ్వర్యంలో బస్సు స్టాండ్, పార్కింగ్ స్థలాలు, ఇతర చోట్ల పూర్తి వివరాలతో హెల్ప్ డెస్క్ సిబ్బంది అందుబాటులో ఉండాలని, ప్రతిచోట అన్ని వివరాలతో కూడిన సైన్ బోర్డులు పెట్టించాలని తెలిపారు. ఆలయంలోని క్యూల వద్ద, పార్కింగ్ స్థలాల వద్ద, బస్సు స్టాండ్లలో తాగు నీటి సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. సెస్ అధికారులు భీమేశ్వర ఆలయం, బద్ది పోచమ్మ ఆలయం, ఇతర చోట్ల 24 గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు కూడా చేసుకోవాలని, అధికారులు, సిబ్బంది ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖా ఆధ్వర్యంలో భీమన్న ఆలయం, ప్రసాదం కౌంటర్, పార్కింగ్ స్థలాలు ఇతర చోట్ల వైద్యులు, సిబ్బంది, అంబులెన్స్ లతో సిద్దంగా ఉండాలని వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా, అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖా అధికారులు ప్రధాన ఆలయాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు చెక్ చేయాలని, వారి సిబ్బంది గుడి ఆవరణలో జాతర సమయంలో సిద్దంగా ఉండాలని సూచించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎక్కడా దర్శనం, వసతులలో ఇబ్బందులు రాకుండా చూడాలని స్పష్టం చేశారు. మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని, వీఐపీ, వీవీఐపీల దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్ లో ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాబాయి, ఆలయ ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ప్రజానావ, ఆదిలాబాద్:** మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మహిళల ఆరోగ్యం, పరిశుభ్రత, సాధికారత లక్ష్యంగా 'ప్రగతి' కార్యక్రమాన్ని గురువారం జైనథ్ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. దేశంలోని ప్రముఖ టెలికాం మౌలిక వసతుల సంస్థ ఇండస్ టవర్స్ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా, పింకిషే ఫౌండేషన్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం, విద్యపై పెట్టే పెట్టుబడి సమాజ భవిష్యత్తును ప్రభావితం చేస్తుందన్నారు. రుతుక్రమంపై ఉన్న అపోహలను తొలగించి కిశోర బాలికలు, మహిళల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు అవసరమని పేర్కొన్నారు. 'ప్రగతి' కార్యక్రమాన్ని జిల్లాలో నిబద్ధతతో అమలు చేయడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుపై దృష్టి సారించి ఐఐటీ, ట్రిపుల్ ఐటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో అవకాశాలు సాధించాలని సూచించారు. ఇండస్ టవర్స్ ప్రతినిధి అరుణ్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణకు తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో



అవగాహన పెంచడం ద్వారా మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. అనంతరం మోడల్ స్కూల్ కు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించి అధికారులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా, సంతోష్ రామ్, సీసీఈఓ అరుణ్, పింకిషే ఫౌండేషన్ ప్రతినిధులు శాతిని గుప్తా, అరుణ్ గుప్తా, జైనథ్ సర్పంచ్ మమత, ప్రత్యూష, కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మె విజయవంతం

# కదలిన కార్మికవర్గం

**ప్రజానావ, జైనూర్:** కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జైనూర్ మండల కేంద్రంలో విజయవంతమైంది. గురువారం కార్మిక వర్గం భారీగా తరలివచ్చి సమ్మెలో పాల్గొన్నారు. మార్కెట్ యార్డ్ నుంచి కొమరం భీమ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్మికులు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం, ఆదివాసి సంక్షేమ పరిషత్ సమ్మెకు మద్దతు ప్రకటించాయి. సమ్మెను ఉద్దేశించి తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు కొంగా మలశ్రీ మాట్లాడుతూ కార్మిక వర్గానికి వ్యతిరేకంగా మరణశాసనంలా నాలుగు లేబర్ కోడ్లు తీసుకువచ్చారని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బీబీజీ రామ్‌జీ చట్టం, వేతన సవరణ బిల్లు, ఎల్ఐసీలో వంద శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి వంటి నిర్ణయాలను రద్దు చేయాలని కోరారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని పేర్కొన్నారు. ఆదివాసి సంక్షేమ పరిషత్ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సెద్మకి భగవంతు రావు మాట్లాడుతూ




నాలుగు లేబర్ కోడ్ల కారణంగా అసంఘటిత కార్మికులకు ప్రయోజనాలు కలుగుతాయని మోదీ ప్రభుత్వం అబద్ధపు ప్రచారం చేస్తోందన్నారు. లేబర్ కోడ్లలో కార్మిక వర్గానికి స్పష్టమైన రక్షణ లేదని విమర్శించారు. అంగన్వాడి, ఆశా, మధ్యాహ్న భోజనం, ఐకేపీ, ఉపాధి హామీ, నేషనల్ హెల్త్ మిషన్ వంటి పథకాల్లో పనిచేస్తున్న వారిని కనీసం కార్మికులుగా గుర్తించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ కోడ్లు కార్మికులను బానిసత్వంలోకి నెట్టే విధంగా ఉన్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మడవి గణపతి, ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు సోని రావు, మండల యూనియన్ నాయకులు తార, గంగామణి, మాడవి కొద్దు, సోనే రావు, దివ్యజ్యోతి, రవీందర్, సీతాబాయి, ఓమల, గేడం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**ప్రజానావ, తాండూర్:** పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని తాండూర్ మండలంలోని మిషన్ భగీరథ కార్మికులు కోరారు. గురువారం అపెక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ మిషన్ భగీరథ తాండూర్ మండల ఇంచార్జ్ మోబిన్ హైమద్‌కు పంపు ఆపరేటర్లు, వాల్వ్ ఆపరేటర్లు, ఫిట్టర్లు, హెల్పర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆరు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 20లోగా చెల్లించాలని, లేనిపక్షంలో విధులకు హాజరుకాలేమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కే లింగయ్య, డి శంకర్, డి ఆనంద్ రామ్, ఆర్ శ్రీనివాస్, కే అరుణ్, రాజమహేందర్, ఏ గణేష్, ఇమ్రాన్ ఖాన్, జే వెంకటేష్, టీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## నీలాద్రి శివయ్య దర్శనానికి 25 ప్రత్యేక బస్సులు



**ప్రజానావ, సత్తుపల్లి:** మహాశివరాత్రి సందర్భంగా నీలాద్రిశ్వరుని ఆలయానికి సత్తుపల్లి నుంచి ఆదివారం 25 ప్రత్యేక బస్సులు భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసినట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా సత్తుపల్లి డిపో నుంచి నీలాద్రికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. సత్తుపల్లి నుంచి పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30 చార్జీగా నిర్ణయించినట్లు చెప్పారు. అదేవిధంగా వీఎం బంజర నుంచి కూడా నీలాద్రికి ప్రత్యేక బస్సులు నడిపే విధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటితో పాటు సత్తుపల్లి నుంచి అన్నపురెడ్డిపల్లి శివాలయానికి కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈనెల 15 ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి 16న ఉదయం 6 గంటల వరకు ఈ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీను బట్టి మరికొన్ని అదనపు సర్వీసులు కూడా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేసుకోవాలి




**ప్రజానావ, తాండూర్:** ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేసుకోవాలని తాండూర్ ఎస్బిఐ మేనేజర్ అవినాష్ అన్నారు. గురువారం లబ్ధిదారుడు నామిని కొంపల్లి భీమయ్యకు మంజూరైన రూ.2 లక్షల ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన చెక్కును తాండూర్ ఎస్బిఐ బ్యాంక్, భీమిని సీఎఫ్ ఎల్ ఆధ్వర్యంలో లబ్ధిదారునికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇన్సూరెన్స్ కలిగి ఉండటం అవసరమని, ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.2వేలతో పాలసీ తీసుకుంటే ప్రమాద మరణం జరిగితే నామినీకి రూ.40 లక్షల పరిహారం అందుతుందని, ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేసుకోవాలని పేర్కొన్నారు. 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల ప్రతిఒక్కరూ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, 18 నుంచి 50 లోపు వారు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాలలో చేరాలని తెలిపారు. సీఎఫ్ఎల్ కౌన్సిలర్ రవి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన అవసరమని, ఇప్పుడు ఎక్కువగా జరుగుతున్న డిజిటల్ అరెస్ట్, ఓటీపీ షేరింగ్, ఏపికే ఫైల్స్, ఆన్లైన్ స్కామ్స్ వంటి 40 రకాల సైబర్ క్రైమ్స్ పై అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమంలో ఎస్బిఐ తాండూర్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు



**ప్రజానావ, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ మున్సిపల్ పీఠం బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ధీమా వ్యక్తం చేశారు. గురువారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ పార్టీల తీరును విమర్శించారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఓడించేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీజేపీ పార్టీ లోపాయికారీ ఒప్పందాలతో కుమ్మక్కై ప్రచారం నిర్వహించాయని పేర్కొన్నారు. ఈ కుట్రలు ఫలించవని, ప్రజలు నిజాన్ని గుర్తించి బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తారని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. ప్రజలు తమకు అండగా నిలుస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# మహాశివరాత్రికి విస్తృత ఏర్పాట్లు


**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ రాజరాజేశ్వరి దేవస్థానం అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి ఆలయంలో జరగనున్న మహాశివరాత్రి జాతరను ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలను సమకూర్చుతున్నట్లు ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు. మూడు రోజుల పాటు సుమారు 2 లక్షల నుంచి 3 లక్షల వరకు భక్తులు విచ్చేస్తారని అంచనా వేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. భక్తులకు పంపిణీ చేయడానికి 2 లక్షల నుంచి 2.5 లక్షల వరకు లడ్డు ప్రసాదాలను సిద్ధం చేస్తున్నారు. భక్తుల విశ్రాంతి కోసం 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి కోసం 'రాజన్న జల ప్రసాదం' కింద 6 ప్రధాన కేంద్రాలు, 30 ప్రాంతాల్లో నీటి సరఫరా అందుబాటులో ఉండగా, ట్రాలీ ఆటోల ద్వారా కూడా నీటిని పంపిణీ చేయనున్నారు. అదనంగా 440 షవర్స్‌తో జల్లు స్నానాల సదుపాయం కల్పిస్తున్నారు. వాహనదారుల కోసం కళ్యాణకట్ట పక్కన ప్రత్యేక పార్కింగ్‌తో పాటు పలు సెక్టార్లలో ఓపెన్ ప్లేస్ పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. సాయి రక్ష, ఐబీపీ గోదాం, బాలనగర్, ఏక్ట్ తదితర ప్రాంతాల్లో ప్రధాన పార్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో లక్ష వరకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నారు. 14, 15 తేదీల్లో ఉదయం 7 గంటల నుంచి నిరంతరాయంగా అల్పాహారం (టిఫిన్లు) అందించనున్నారు. ప్రసాదం కౌంటర్లను ఆలయ ఎగ్జిట్ వద్ద ఏర్పాటు చేస్తున్నారు. 15న ఉదయం



8 గంటలకు తెలంగాణ ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాల సమర్పణ ఉండగా, 14న సాయంత్రం 7 గంటలకు బీసీ వెల్ఫేర్, రవాణా శాఖ మంత్రి సమర్పించనున్నారు. అన్ని ఆలయాలకు ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ, పూల అలంకరణలు చేయడంతో పాటు భక్తుల సహాయార్థం దేవస్థాన పరిసర ప్రాంతాల్లో 7 'మే ఐ హెల్ప్ యూ' కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని శాఖల సమన్వయంతో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా పర్యవేక్షణ చేపట్టనున్నారు. ఉద్యోగులకు భోజనం, వసతి సదుపాయాలు కల్పించడంతో పాటు ఫిబ్రవరి 14 నుంచి 16 వరకు శివార్చన స్టేజ్‌పై సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక శివార్చనలు నిర్వహించనున్నారు. రాజన్న భక్తుల కోసం ప్రత్యేక వాట్సాప్ సేవలు కూడా అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. 8736936969 నంబర్‌కు 'హాయ్' అని మెసేజ్ చేయడం ద్వారా ఆలయ సేవల వివరాలు పొందవచ్చని అధికారులు సూచించారు.







## మెరుగైన వైద్య సేవలందించాలి



**ప్రజానావ, మంచిర్యాల:** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కన్నెపల్లి మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వార్డులు, మందుల నిల్వలు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని తెలిపారు. ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, సామాగ్రి సమకూరుస్తామని అన్నారు. కేజీబీవీని సందర్శించి పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పాఠశాలలో భోజనశాల నిర్మాణ పనులను ప్రారంభించాలని సూచించారు. మధ్యాహ్న భోజనంలో ఆహారం తయారీకి వినియోగిస్తున్న సామాగ్రిని పరిశీలించి తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను మాత్రమే వినియోగించాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేసి వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని, సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ప్రజా సంక్షేమం దిశగా చర్యలు తీసుకోవాలి

**ప్రజానావ, మంచిర్యాల:** ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వ శాఖల అధికారులు చర్యలు తీ సుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం బెల్లంపల్లి మండల కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి సందర్శించారు. డివిజన్ పరిధిలో కొనసాగుతున్న పనులు, ప్రజా సంక్షేమ పథకాల అమలు అంశాలను పరిశీలించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ డివిజన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజల సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. కార్యాలయంలోని విభాగాలను పరిశీలించి కార్యాలయ సొంత భవనం నిర్మాణం కోసం స్థలాన్ని గుర్తించాలని సూచించారు. బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించి ఈనెల 13న జరగనున్న కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. కౌంటింగ్ సిబ్బందికి అవసరమైన తాగునీరు, ఇతర ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఓట్ల లెక్కింపులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా లెక్కింపు ప్రక్రియ చేపట్టాలని పేర్కొన్నారు. పట్టణంలోని రామ్ నగర్ ప్రాంతంలో చేపట్టిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులను సందర్శించి త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ సంపత్, తహసిల్దార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

